సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



మిరుదొడ్డి(దుబ్బాక): వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్పగా చేస్తున్న రైతు

తడిసిన ధాన్యం రైతుల దైన్యం



మద్దూరు(హుస్నాబాద్): వడ్లపై కప్పిన టార్పాలిన్‌లు

మిరుదొడ్డిలో శనివారం సాయంత్రం అల్పపీడన ప్రభావంతో భారీ వర్షం కురిసింది. దీంతో ఆరబెట్టిన వడ్లను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. అప్పటికే ధాన్యం తడిసి ముద్దయింది. చేసేదేమి లేక నీటిలో కొట్టుకుపోయిన ధాన్యపు రాశులను ఎత్తిపోసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఆ మేరకు పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. ఇక మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోశారు. పొద్దంతా ఎండకు ఎండిన వడ్లు.. శనివారం ఒక్కసారిగా కురిసిన వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో టార్పాలిన్ పట్టాలను కప్పి పంటను రక్షించుకున్నారు.

– మిరుదొడ్డి(దుబ్బాక), మద్దూరు(హుస్నాబాద్)



సిరుల పల్లెటూరు

పచ్చని పంటలు, పుట్ల కొద్ది ధాన్యరాశులు

- ప్రతీ ఇంటా పాడి పశువులు
- నిత్యం 400 లీటర్ల పాల ఉత్పత్తి
- డీజే సౌండ్స్ వద్దు.. పౌరాణిక నాటకమే ముద్దు
- పట్టభద్రులు సైతం రామాయణ నాటక ప్రదర్శనలు
- రూ.3.20 లక్షల వరకు విరాళాల సేకరణ

సండే స్పెషల్

సిరులు పండించే ఆ పల్లెటూరు కోడి కూతలతో నిద్రలేస్తుంది. పొద్దున్నే రైతుల కోలాహలం, ఎటుచూసినా పాల వెల్లువ. కళ్లెదుటే పచ్చని పంట పొలాలు చూసి మురిసిపోతారు. గొడ్డు గోదలు వ్యవసాయమే జీవనాధారం. పౌరాణిక నాటకాలు వేస్తూ స్నేహబంధంతో మెలుగుతూ ఇతర గ్రామాలకే ఆదర్శంగా నిలుస్తున్నారు హుస్నాబాద్ మండలంలోని బంటుపల్లె గ్రామస్తులు.

8లో

- దుండ్ర ఎల్లయ్య
హుస్నాబాద్ రూరల్



న్యూస్‌రీల్

రోడ్డు విస్తరణకు రూ.77.20 కోట్లు: మంత్రి పొన్నం



హుస్నాబాద్: కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నాలుగు రోడ్ల విస్తరణ పనులకు ఎండీఆర్ ప్లాన్ ద్వారా ప్యాకేజీ2 కింద రూ.77.20 కోట్లు మంజూరయ్యాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం 21 కి.మీలకు గాను రూ.163 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. మొదటి విడతలో 11 కి.మీలకు గాను రూ.77.20 కోట్లు మంజూరైనట్లు స్పష్టం చేశారు. మిగతా నిధులు రెండో విడతలో త్వరలోనే మంజూరు కానున్నట్లు తెలిపారు. ఆ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి పోలీస్ ఫ్లాగ్‌డే కార్యక్రమాలు

సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఈనెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షీటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్, డాగ్ స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, ప్రతిభ, త్యాగాలపై విద్యార్థులకు తెలియజేస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఆరోజు కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో అమరులను స్మరిస్తూ నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులు ఎవరు కూడా మధ్యవర్తులు, దళారులను నమ్మి మోసపోవద్దని హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. అక్కన్నపేట మండలం పంతులీతండా, పోతారం(జే), రామవరం గ్రామాల్లో శనివారం సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు పొందాలంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. విక్రయానికి వచ్చే రైతులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఏఈఓ కరంటోతు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి



మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా జైలును ఆమె శనివారం సందర్శించారు. ఖైదీల వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. వారికి కల్పిస్తున్న మౌలిక, భోజన సదుపాయాలు గురించి జిల్లా జైలు సూపరింటెండెంట్ వికాస్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా జైలులో 32 మంది ఖైదీలు ఉన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.బాలయ్య, శ్రీకర్‌రెడ్డి, వెంకటేశ్, రాజ్యలక్ష్మి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి తర్వాతే కొనుగోళ్లు?

ధాన్యం కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు

- గాగిల్లాపూర్ మిల్లుకు పచ్చివడ్ల తరలింపు
- ఇప్పటి వరకు సగానికి పైనే విక్రయం



కోహెడ ఐకేపీలో రైతు పడిగాపులు

కోహెడ(హుస్నాబాద్): ధాన్యం విక్రయం విషయమై రైతులకు తిప్పలు తప్పటం లేదు. గతేడాది లాగే ఈసారి కూడా కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ఐకేపీ, ప్యాక్స్ కేంద్రాల్లో విక్రయించేందుకు వచ్చిన రైతులకు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు.

ప్రభుత్వ ఉన్నతాధికారులు, మిల్లర్ల కసరత్తు?

గతంలో రైస్ మిల్లర్లకు క్వింటాలు వడ్ల ఇస్తే 67 కిలోలు బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఈ ఏడాది అంత మొత్తం కాకున్నా.. ఎంత ఇవ్వాలనే దానిపై ప్రభుత్వ అధికారులతో కలిసి వారు చర్చిస్తున్నారు. దీంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. డీఎం సివిల్ సప్లయ్ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి గోదాంలకు తరలించేందుకు సైతం అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మరోవైపు దీపావళి తర్వాతే కొనుగోళ్ల ప్రారంభం కానున్నట్లు తెలిసింది.

ప్రభుత్వా ఖజానాకు గండి

ప్రతీ యేటా కొనుగోళ్ల జాప్యం కావడంతో ప్రభుత్వం, అధికారుల తీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల్లో వడ్ల నిల్వకు స్థలం లేకపోవడం, లారీల కొరతతో కొనుగోళ్ల జాప్యం కావడం, మిల్లర్లు ఏదొక సాకుతో ధాన్యాన్ని దించుకోకపోవడం, వడ్ల బస్తాల్లో కోత, కేంద్రాల్లో వసతుల్లేమి తదితర కారణాలు వెంటాడుతున్నాయి. దీంతో ఈసారి వందలాది రైతులు బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ రైస్ మిల్లులో పచ్చి ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

కొనుగోళ్లలో జాప్యం వాస్తవమే



అనివార్య కారణాలతో కొనుగోళ్ల జాప్యం అవుతున్నాయి. వర్షాలు కురవడంతో ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతం ప్రకారం వడ్లు రాకపోవడం, హమాలీల సమస్య, లారీల కొరత తదితర సాంకేతిక లోపాలతో కొంతవరకు కొనుగోళ్లు అప్పుడప్పుడు ఆలస్యం అవుతున్నాయి. ఈ యేడు అలాంటి సమస్య తలెత్తకుండా ఉన్నతాధికారులు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేశారు. వారి ఆదేశాల ప్రకారం సమస్యలు లేకుండా కొంటాం.

- తిరుపతిగౌడ్, ఐకేపీ ఏపీఎం కోహెడ

కోహెడ ఐకేపీలో ధాన్యం కొనుగోళ్లు ఇలా

ఏడాది	సీజన్	కొనుగోళ్లు క్వింటాళ్లు	విక్రయించిన రైతుల సంఖ్య
2021	యాసంగి	17,998.80	324
2021	వానాకాలం	6,629.60	176
2022	యాసంగి	13,967.20	276
2022	వానాకాలం	10,735.60	272
2023	యాసంగి	12,297.60	268
2023	వానాకాలం	9,206.80	214
2024	యాసంగి	7,272.80	176

పచ్చివడ్లు విక్రయం



వడ్ల లోడుతో ఉన్న ట్రాక్టర్లు (ఫైల్)

ప్రభుత్వం ఐకేపీ, ప్యాక్స్ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధం అయినప్పటికి మూడు, నాలుగు ఏళ్ల నుంచి పచ్చి ధాన్యం విక్రయానికే రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర కంటే పచ్చి ధాన్యం క్వింటాలు ధర వ్యత్యాసంలో సుమారు రూ.300 నుంచి 400 వరకు తగ్గింపు ఉంది. అయినా విక్రయించేందుకు గాగిల్లాపూర్ మిల్లు వద్ద ధాన్యం లోడు ట్రాక్టర్‌లతో వచ్చి రైతులు బారులు తీరుతున్నారు.



కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ మధు, సీఐలు

నర్మేటలో ఉద్రిక్తత

- ఆయిల్‌పామ్ సదస్సులో వాగ్వాదం
- కార్యక్రమానికి ఎలా వస్తారంటూ కాంగ్రెస్ నిరసన
- తాము సాగు చేపట్టామన్న బీఆర్ఎస్ నేతలు
- కొద్దిసేపు తోపులాట.. పోలీసులు జోక్యంతో సద్దుమణిగిన వివాదం

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్ సాగుపై అపోహలు తొలగించేందుకు నంగునూరు మండలం నర్మేటలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సు కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య గొడవ వల్ల ఉద్రిక్తతకు దారి తీసింది. రైతు సదస్సుకు బీఆర్ఎస్ నాయకులు ఎలా వస్తారని కాంగ్రెస్ నాయకులు గోబ్యాక్ అంటూ ప్లా కార్డులు చేతబూని నిరసన తెలిపారు. తాము ఆయిల్ పామ్ పంట సాగు చేశామని, అడ్డుకోవడానికి మీరెవరంటూ గులాబీ శ్రేణులు ప్రశ్నించారు. దీంతో సదస్సులో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల నాయకుల వాగ్వాదం మధ్య కొంతసేపు తోపులాట జరిగింది. ఈ సదస్సుకు ఎమ్మెల్యే హరీష్‌రావు వస్తున్నారని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గోబ్యాక్ ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఏసీపీ మధు తోపాటు పలువురు సీఐలు, ఎస్ఐలు పోలీస్ బలగాలు అక్కడికి చేరుకొని రెండు వర్గాల వారికి అక్కడి నుంచి పంపించాయి. కేవలం ఆయిల్‌పామ్ రైతులను సదస్సుకు పంపాలని కాంగ్రెస్ నాయకులు పట్టు పట్టడంతో జాబితాలో పేర్లున్న రైతులనే సదస్సుకు అనుమతించగా సమావేశం ప్రారంభమైంది.

పంటకు భరోసా మాది: కలెక్టర్ మను చౌదరి



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ఆయిల్‌పామ్ పంటకు భరోసా మాది అని కలెక్టర్ మనుచౌదరి రైతులకు హామీ ఇచ్చారు. మెయింటెనెన్స్ డబ్బులు రావడం లేదని, అంతర పంటలు, మందులు ఎక్కడ దొరుకుతాయో అధికారులు అవగాహన కల్పించడంతో పాటు సబ్సిడీపై సోలార్ ఫినిషింగ్ అందజేయాలని రైతులు కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా నర్మేటలో 65 ఎకరాల్లో రూ.300కోట్లతో చేపట్టిన ఆధునాతన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతోందన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, వ్యవసాయ అధికారి రాధిక, ఏఓ గీత, ఆయిల్‌ఫెడ్ అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్ రాజీనామా చేయాలి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): ప్రజా సమస్యలపై చర్చకు సిద్ధంగా లేని కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి డిమాండ్ చేశారు. కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ఆర్అండ్ఆర్ కాలనీల నిర్వాసితుల సమస్యలపై చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమని, ఎప్పుడంటే అప్పుడు ఆర్అండ్ఆర్ కాలనీలకు తీసుకువస్తామని స్పష్టం చేశారు. ములుగు మండలం వంటిమామిడిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు బదులు చర్చకు తాము వస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డిలు మరోవైపు ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు.

రక్షిత నీటి సరఫరాకు ప్రాధాన్యం

వర్గల్(గజ్వేల్): గ్రామీణ ప్రజలకు రక్షిత తాగు నీటిని సరఫరా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ రాజు పేర్కొన్నారు. శనివారం వర్గల్ ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన తాగునీటి సరఫరా గ్రామీణ సహాయకుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కలుషిత తాగు నీరు తాగితే అతిసార, డయేరియా తదితర వ్యాధులు ప్రబలుతాయన్నారు. అనంతరం సహాయకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

బోనస్ బోగస్

- పొలాల వద్దే వడ్లు అమ్మొద్దనడం సరికాదు
- ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



యార్డులో మహిళా కార్మికులు, రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపజేయకుండా కేవలం సన్నాలకే రూ.500లు ఇస్తామనడం సరికాదని, ఇది బోనస్‌ను బోగస్ చేసిన ప్రభుత్వం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక పత్తి మార్కెట్ యార్డులో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో, ప్రధానంగా సిద్దిపేట ప్రాంతంలో వందకు తొంభైశాతం దొడ్డు రకం పండుతుందన్నారు. ఇచ్చే సన్నరకం బోనస్ విషయంలో ప్రభుత్వం మార్కెట్ యార్డులో మాత్రమే అమ్మాలని, బావులు, పొలాల వద్ద అమ్మితే బోనస్ ఇవ్వబోమని కొర్రీలు పెడుతోందని ఆరోపించారు. ఎక్కడ అమ్మినా గానీ సన్నాలు పండిస్తే బోనస్ ఇవ్వాలన్నారు. మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్ పట్టాలు, గన్ని సంచులు, రవాణా సౌకర్యాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు రైతు వ్యతిరేక ప్రభుత్వంగా మారిందన్నారు. వారికి ఇచ్చిన ఏ ఒక్క హామీని సవ్యంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు భరోసాను దీపావళికి ఇస్తామని చెప్పి ఈరోజు వ్యవసాయ శాఖ మంత్రి ఇవ్వలేమని ప్రకటించడంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 11 సార్లు రూ.72 వేల కోట్లు రైతుభరోసా కింద రైతులకు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ సర్కారు మొదటిసారి ఇచ్చి రెండోసారి ఎగ్గొట్టిందని విమర్శించారు. ప్రస్తుతం పత్తి రైతులు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గి ఇబ్బందుల్లో ఉన్నారని, వెంటనే పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర వచ్చేలా చూడాలని కోరారు. అంతకుముందు మార్కెట్ యార్డులోని రైతులు, హమాలీ కార్మికులు, కూలీల నుంచి పలు అంశాలపై ఆరా తీశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి తనూజ, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, సెక్రటరీ కృష్ణ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై నిరసన



సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

గజ్వేల్: రైతు భరోసాపై సబ్ కమిటీ వేశాం, ఆ కమిటీ రిపోర్ట్ వచ్చాక వచ్చే సీజన్ నుంచి రైతు భరోసా వేస్తామన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలపై దుమారం రేగింది. శనివారం ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు గజ్వేల్‌లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ముందు పోలీసులు రంగం ప్రవేశం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా సీఐ సైదా, నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొద్దిసేపు తోపులాట జరిగింది. అయినా చివరకు బీఆర్ఎస్ శ్రేణులు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్నికలకు ముందు రైతుభరోసా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ నేడు మాట తప్పుతుందని నేతలు విమర్శించారు. వెంటనే రైతుభరోసా డబ్బులు ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

వర్గల్(గజ్వేల్): సోషల్ మీడియాకు, సెల్‌ఫోన్‌కు విద్యార్థిలోకం దూరంగా ఉంటే చక్కని భవిష్యత్ వైపు సాగొచ్చని ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం వర్గల్ మండలం గౌరారం దక్కన్ పబ్లిక్ స్కూల్‌లో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గజ్వేల్ షీటీమ్ బృందం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మహిళల భద్రతకు షీటీమ్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. ఒకవేళ ఎవరైనా వేధింపులకు పాల్పడితే 100, 112, 1098, షీటీమ్ వాట్సాప్ 87126 67343, మహిళా పీఎస్ 8712667435, హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ 9440700906, 04027852246 నంబర్లో సమాచారం అందించాలన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): క్రీడలతో ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట బాలుర ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న 68వ జిల్లాస్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య మాట్లాడారు. విద్యతో పాటు క్రీడలు చాలా అవసరమన్నారు. ప్రతీఒక్కరు క్రీడలను ప్రోత్సహించాలన్నారు. పోటీల్లో గెలుపోటములు సాధారణమని, విజయం సాధించిన వారు మరింత రాణించేలా, ఓటమి పొందిన వారు గెలుపునకు పునాదులు వేసుకోవాలన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడకారులు రాష్ట్రస్థాయిలోను రాణించి సిద్దిపేట జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, టీచర్స్, అధికారులు, క్రీడాకారులకు బహుమతులు, ఆహారం అందించిన వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సతీశ్, అశోక్ , హరికిషన్, రామేశ్వర్‌రెడ్డి, మురళీధర్, భిక్షపతి, లక్ష్మీనారాయణ, నర్సయ్య, రవికుమార్, గోవర్ధన్‌రెడ్డి, నవీన్, లలితాభవాని, ప్రశాంత, రాధిక పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

ఎమ్మెల్యే హరీశ్ రావు



చెక్కు అందజేస్తున్న హరీశ్ రావు

సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహించాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, మార్కెటింగ్ జిల్లా అధికారి, జిల్లా సహకార శాఖ అధికారి, పీఏసీఎస్ చైర్మన్‌లతో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఆయా మండలాల వారీగా ఆరా తీశారు. సంచుల కొరత లేకుండా చూడాలని సూచించారు. మిల్లర్లు అలాట్‌మెంట్ చేయాలని, విద్యుత్ సమస్య లేకుండా చూడాలని సూచించారు. అంతకుముందు పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌లను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, నాయకులు సాయిరాం, భూపేశ్, వర్మ, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



చరణ్‌ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చేర్యాల(సిద్దిపేట): సంగారెడ్డిలో 21న జరుగనున్న జిల్లా స్థాయి క్రికెట్ అండర్ 19 పోటీలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కర్రోళ్ల చరణ్ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఎన్.జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంఠ చరణ్‌ని కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలి

పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు సరైన విధంగా బోధన అందడం లేదని తల్లిదండ్రులు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. పాఠశాలలో 350 మంది విద్యార్థులు ఉండగా కేవలం 6 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 10మంది ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. అదే విధంగా పాఠశాలలో హెల్పర్ (ఆయాలు)లు లేకపోవడంతో చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, వెంటనే వారిని కూడా నియమించాలన్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

సిరుల పల్లెటూరు



- పచ్చని పంటలు, పుట్లకొద్దీ ధాన్యరాశులు
- ప్రతీ ఇంటా పాడి పశువులు
- ఆదర్శంగా బంటుపల్లె గ్రామం





హుస్నాబాద్‌రూరల్: గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు.. పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. అక్షరాస్యత, పరిశుభ్రత, స్వచ్ఛత, మద్యానికి దూరంగా ఉండడం మౌలిక వసతుల కల్పన ద్వారా గ్రామాలు త్వరగా అభివృద్ధి సాధిస్తాయి. ఇదే కోవకు చెందినది ఓ పల్లె. హుస్నాబాద్ మండల కేంద్రానికి చెందిన 'బంటుపల్లె' అనే ఊరు సిరుల పల్లెటూరు చెప్పుకుంటారు. గ్రామంలో పచ్చని పొలాలు, పాడి పశువులు, పరిశుభ్రత, గ్రామానికి కావాల్సిన మౌలిక వసతులు ఇలా రకాలుగా గ్రామం అభివృద్ధి చెందింది.పచ్చని పల్లె వాతావరణం, పంట చేళ్లు, పాడి పశువుల పెంపకంతోనే ఈ పల్లె జీవనం సాగుతుంది

హుస్నాబాద్ మండల కేంద్రానికి 5 కిలో మీటర్ల దూరంలో ఉండే బంటుపల్లె పాడి పంటలకు నిలయంగా ఉంది. బంటుపల్లెలో 50 గడపలు ఉంటే అందరికీ రెండు ఎకరాల పైనే వ్యవసాయ భూములు ఉండటం వాటికి తోడు పాల ఉత్పత్తి ఎంచుకొని ప్రతీ ఇంటా రెండు, మూడు పాడి పశువులను పెంచుతారు. ఈ పల్లె రైతులు నిత్యం 400 లీటర్ల పాలు కరీంనగర్ పాల కేంద్రానికి సరఫరా చేస్తారు. 350 ఎకరాల వరకు వ్యవసాయ భూముల్లో రైతులు వరి, పత్తి పంటలను సాగు చేసి పుట్లకొద్ది దిగుబడులు తీసి ధాన్య రాశులను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తారు. పచ్చటి ప్రకృతి అందాల నడుమ జీవనం సాగించే పల్లె ప్రజలు వారి తాతల నుంచి వచ్చే పౌరాణిక నాటక ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు.



రామాయణం నాటకంలో పట్టభద్రులు

నాటక రంగంలో పట్టభద్రులు

బంటుపల్లెలో 50 గడపలు ఉంటే 25 మంది డిగ్రీ చేసిన వారు ఉంటారు. ఈ యువత నాటక ప్రదర్శనలో పాల్గొని వారి కళా నైపుణ్యాలను ప్రదర్శిస్తారు. ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ పల్లెలో రామాయణం వేస్తున్నామంటే అందరూ అక్కడికి చేరుకుంటారు. 1976 నుంచి పల్లెలో రామాయణం, వీరబ్రహ్మం చరిత్రలను నాటక రూపంలో ప్రదర్శిస్తారు. కంప్యూటర్ యుగం, డీజే పాటల మోజు ఉన్నప్పటికీ పల్లె యువత ఏ కార్యక్రమాలకు డీజేలను ఉపయోగించరు. శబ్ద కాలుష్యం లేకుండా గణపతి, దేవీ నవరాత్రులకు రాత్రి సమయంలో యువత మండపాలకు చేరుకొని పౌరాణిక నాటకాల్లో పాటలు పాడుతూ భజనలు చేస్తారు. చిరుతల రామాయణం, కోలాట ప్రదర్శనలతో ఆనందంగా నవరాత్రులను ముగిస్తారు. పౌరాణిక నాటకలను ప్రదర్శించి పొరుగు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవలె రూ.3.20 లక్షల వ్యయంతో చిరుతల రామాయణ చరిత్రను ప్రదర్శించారు. తండ్రీకొడుకులు సోదరులు, ఉద్యోగులు నాటకంలో పాల్గొని కళానైపుణ్యాలను ప్రదర్శించారు. గ్రామంలో మద్యపానం సైతం నిషేధం విధించి బెల్టు షాపుల నిర్వహణ లేకుండా చేశారు.



దశరథుడి పాత్రలో విద్యుత్ ఉద్యోగి బంటు రాజమల్లు

మా ఊరిలో నాటకం అంటే ఇష్టం



నేను డిగ్రీ చేసిన మా పల్లెలో రామాయణం చేస్తున్నారంటే పోత, నేను పక్షిరాజు, అహల్య పాత్రలను పోషించాను. పల్లెలో ఉండే స్వేచ్ఛ, ప్రకృతి వాతావరణం పట్టణంలో దొరకదు. చదువుకొనే రోజుల్లో మా చిన్నతనంలో కూడా రామాయణ నాటక ప్రదర్శన చేసివారు. పెద్దవాళ్లను అనుకరించి సంస్కృతిని కొనసాగించాలని ఆర్థిక భారమైన రామాయణం చరిత్రను ప్రదర్శిన చేస్తున్నాం.

– వెంకటేశ్, బంటుపల్లె

మా నాన్న దశరథుడు, నేను రాముడి పాత్రలో..



నేను డిగ్రీ పూర్తి చేసిన గ్రూపు కోసం ప్రిపేర్ అవుతున్నాను. మా నాన్నతోపాటు నేను రామాయణంలో రాముడి పాత్రను పోషించి ప్రజలను మెప్పించాను. మా పల్లె మీద ఏ వేడుక జరిగిన డీజే పాటలు పెట్టం. పౌరాణిక నాటకల్లోని పాటలు పాడుతూ భజనలు చేస్తాం. గణపతి, దేవీ నవరాత్రుల ఉత్సవాలను జరుపుకుంటాం. శబ్ద కాలుష్యంకు దూరంగా మా పల్లె ప్రజల జీవనం కొనసాగుతుంది.

– బంటు కిరణ్‌కుమార్, పట్ట భద్రుడు

కోడి కూతతోనే నిద్ర లేస్తాం..



బంటుపల్లెలో అందరికీ మూడు ఎకరాలకు మించే వ్యవసాయ భూములు ఉండటంతో వ్యవసాయం చేసుకుంటాం. వ్యవసాయానికి తోడు పాల ఉత్పత్తికి ఇంటికో రెండు ఆవులు తీసుకొని పాల ఉత్పత్తి చేస్తాం. నెల నెలా పెట్టుబడులకు పాల బిల్లు వస్తుంది. గొడ్డుగోదాలతోనే పల్లె అలజడిగా ఉంటది. మాకు పండగల సమయంలో పౌరాణిక నాటక ప్రదర్శనలు చేస్తాము. ఇంటికొక్కరం చేరి తలపెట్టిన కార్యము పూర్తి చేసుకుంటం.

– సల్లా అశోక్, రైతు

రామాయణంలో హనుమంతుడి పాత్ర



మా తాతల నుంచి రామాయణ ప్రదర్శన పల్లె మీద సాగుతుంది. మా పెద్దలను అనుకరించి పల్లె సంస్కృతిని కొనసాగించడానికి ఆర్థిక భారమైనా కొనసాగిస్తున్నాం. పచ్చని పల్లె వాతావరణం, పంట చేళ్లు, పాడి పశువుల పెంపకంతోనే మా జీవనము సాగుతుంది. నేను హనుమంతుడి పాత్రను ప్రదర్శించాను. మా తమ్ముడు అహల్యం పాత్ర పోషించాడు.

– బంటు రాజు, బంటుపల్లె

40 రోజులు నాటకం నేర్పించిన



మా బంటుపల్లె యువకుల ఆసక్తిని చూసి రామాయణం నేర్పించి రెండు రోజులు ప్రదర్శించాం. 40 రోజులు నాటకము నేర్పించాను. డిగ్రీలు చేసిన పిల్లలు కావడంతో తక్కువ సమయంలో నేర్చుకున్నారు. నాటక ప్రదర్శనను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి అందరికీ తెలిసే విధంగా చేశారు. నేను 30 ఏళ్ల నుంచి వీర బ్రహ్మము చరిత్ర, రామాయణము నాటక ప్రదర్శనలు చేసిన, నా వెనుక తరముకు కూడా నాటకంలోని పత్రాలను నేర్పించి ప్రదర్శన చేయించాను. మా పల్లె ఒకే మాట ఒకే ఆట కట్టుబాటుతో ఉండటం సంతోషం కలిగిస్తుంది.

– పోలోజు సుదర్శన్, నాటక గురువు

మంత్రాల నెపంతో ముగ్గురిపై దాడి

- 13 మందిపై కేసు నమోదు
- తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో ఘటన



బాధిత కుటుంబ సభ్యులు

తూప్రాన్: మంత్రాల నెపంతో ఓ కుటుంబంపై దాడి చేసిన 13 మందిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. కిష్టాపూర్ గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన భూమెల్ల పోచయ్య మూడు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మృతుడి భార్య కమలమ్మ, కుమారుడు స్వామి, కోడలు నవనీత పెద్దకర్మ(పెద్దలకు) జరుపుకున్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన 13 మంది మృతుడు పోచయ్య ఆత్మ మా ఇళ్ల చుట్టూ తిరుగుతుంది.. నీవే ఆత్మ తిరగడానికి మంత్రాలు చేశావు.. అంటూ బూత్ మాటలు తిట్టడంతో పాటు మూకుమ్మడిగా కుమారుడు స్వామిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. అడ్డొచ్చిన భార్య నవనీత, తల్లి కమలమ్మలను చితకబాదారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ శివానందం పేర్కొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ



పటాన్‌చెరు: పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన ఘటన జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. జిన్నారం మండలం లక్ష్మీపతి గూడెంకు చెందిన జనార్దన్ శనివారం భార్యతో కలిసి పనికి వెళ్లారు. ఇంటికి తాళం ఉండటంతో గుర్తుతెలియని దుండగులు తాళం పగులగొట్టి బంగారం, వెండి నగదును ఎత్తుకెళ్లారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న దంపతులు వచ్చి చూడగా నాలుగు తులాల బంగారం, ఆరు తులాల వెండి, రూ. 40 వేల నగదు పోయినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్‌లను శనివారం టాస్క్ ఫోర్స్, కోహెడ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని తంగళ్లపల్లి గ్రామ శివారులో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ట్రాక్టర్‌లను సీజ్ చేశారు. యజమానులు చుక్క రాకేశ్, దురిశెట్టి రాజు, యాట్ల శంకర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం..

మద్దూరు(హుస్నాబాద్): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శనివారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. ధూళ్మిట్ట మండల కేంద్రంలో మాలోతు నగేశ్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడు. మండలంలోని చుట్టు ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, నగేశ్‌పై కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బయటపడ్డ గంజాయి

- 87 కిలోల ప్యాకెట్లు స్వాధీనం
- డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- వాహనాన్ని వదిలి పారిపోయిన నిందితులు



ప్రమాదానికి గురైన కారు



గంజాయిని పరిశీలిస్తున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయి బయటపడింది. పోలీసుల కథనం మేరకు.. రామాయపేటంలోని జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగిన ఓ కారు ప్రమాదవవశాత్తు డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. రోడ్డు పక్కనే కారు బోల్తా పడిన విషయమై స్థానికుల ద్వారా పోలీసులు ఘటనా స్థలి వద్దకు వెళ్లగా అక్కడ ఎవరూ లేదు. కారును పరిశీలించగా, డిక్కీలో దాచి ఉంచిన 32 గంజాయి ప్యాకెట్లు లభించాయి. ప్రమాద సమయంలో కారులో కనీసం ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలో గాయాలపాలైనవారు తప్పించుకు పోయారు. ఎస్‌ఐ బాల్‌రాజు, వెంటనే క్లూస్‌టీంతో పాటు తహసీల్ కార్యాలయం నుంచి ఆర్‌ఐని పిలిపించి పంచనామా నిర్వహించి అక్కడే తూకం వేశారు. మొత్తం 32 ప్యాకెట్లలో 87 కిలోల గంజాయి ఉన్నట్లు తేలింది. కారు నంబర్ అసలుది కాదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పట్టుబడ్డ ప్యాకెట్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ వెంకట్ రాజాగౌడ్ వాటిని పరిశీలించారు. ఎస్‌ఐ బాల్‌రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఇద్దరు నిర్వాహకుల అరెస్టు



సాయిరెడ్డి, నాగేశ్వర్‌రావు

పటాన్‌చెరు టౌన్: వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఏపీలోని నెల్లూరు టౌన్‌కు చెందిన పోలంరెడ్డి సాయి క్రిష్ణ రెడ్డి అలియాస్ సాయి రెడ్డి, మేకల నాగేశ్వర్ రావు పటాన్‌చెరు మండలం చిట్కుల్‌కు రెండేళ్ల కిందట వచ్చారు. అక్కడే ఓ ఇంట్లో యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గృహంపై దాడి చేశాం. ఇందులో పశ్చిమబెంగాల్ కు చెందిన యువతని, నిర్వాహకులైన పోలంరెడ్డి సాయి క్రిష్ణ రెడ్డి , మేకల నాగేశ్వర్ రావు లను అదుపులోనికి తీసుకొని విచారించగా వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు ఒప్పుకున్నారు. శనివారం సాయంత్రం ఇద్దరిని రిమాండ్‌కు తరలించి, బాధితురాలిని మాత్రం జిల్లా మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చనున్నట్లు సీఐ తెలిపారు. సాయి క్రిష్ణ రెడ్డిపై గతంలో అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు ఉన్నట్లు తెలిపారు. కేసు ఛేదనలో కీలకపాత్ర పోషించిన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ సిబ్బందిని, సీఐ ప్రవీణ్ రెడ్డిని డీఎస్పీ రవీందర్ రెడ్డి అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో కార్మికుడు ఆత్మహత్య



లింగయ్య(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ సఫాయి కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని కొల్గూరులో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండారి లింగయ్య(55) పదేళ్లుగా సఫాయి గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన భార్య ఇందిరకు చికిత్స చేయించినప్పటికీ మృతి చెందింది. కూతురి పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనోవేదనకు గురైన లింగయ్య శుక్రవారం అర్ధరాత్రి ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక..

పటాన్‌చెరు టౌన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన ప్రకాశ్(25) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతోపాటు కడుపునొప్పి భరించలేక ప్రకాశ్ శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యం తట్టుకోలేక..



రాజేశం (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం చిన్నకోడూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వేములవాడ రాజేశం(65) సెంట్రింగ్ పని చేస్తుండేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పనులు మానుకున్నాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్తాపం చెందిన శనివారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. శవమై తేలి

తూప్రాన్ పెద్ద చెరువులో మృతదేహం లభ్యం

తూప్రాన్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి పది రోజుల తర్వాత మృతదేహమై కనిపించాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని పెద్ద చెరువు వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బందెల దాసు(45) వ్యవసాయ పొలం పక్కన గ్రామానికి చెందిన కొందరు చెట్లను నరికివేశారు. ఈ విషయంపై మనోహరాబాద్ మండలంలోని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడానికి 9న ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదన్నారు. ఈ క్రమంలోనే శనివారం తూప్రాన్ పెద్ద చెరువులో మగ మనిషి శవంను స్థానికులు గుర్తించి ఎస్‌ఐ తెలిపారు. మృతదేహం చూసి దాసుగా అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహం దాసుదిగా నిర్ధారించారు. కాగా, దాసుకు చేపలు పట్టే అలవాడు ఉందని, చేపల వేటకు వెళ్లి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి

కౌడిపల్లి శివారులో ఘటన



సాయవ్వ(ఫైల్)



కౌడిపల్లి(నర్సాపూర్): బోల్తా పడిన ట్రాక్టర్

కౌడిపల్లి(నర్సాపూర్): ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. భుజిరంపేట పంచాయతీ పరిధిలోని వెంకటాపూర్(బి) గ్రామానికి చెందిన బడిగంటి సాయవ్వ (52) ఇంటి అవసరాల కోసం డస్ట్ తీసుకునేందుకు గ్రామానికి చెందిన కొత్తపల్లి యాదాగౌడ్ ట్రాక్టర్‌లో వచ్చింది. కౌడిపల్లిలో డస్ట్ లోడ్ చేసుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా కౌడిపల్లి శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై సాయమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ యాదాగౌడ్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. మృతురాలి కొడుకు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం ఢీకొని వృద్ధుడు



నారాయణ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): డీసీఎం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్ కథనం మేరకు.. భూంపల్లి గ్రామానికి చెందిన పర్స నారాయణ (66) గత శుక్రవారం రోసైకిల్ రిపేర్ కోసం డబుల్ బెడ్రూం కాలనీలోని మెకానిక్‌కు అప్పగించాడు. శనివారం సైకిల్‌ను తెచ్చుకోవడానికి బయలుదేరిన నారాయణ డబుల్ బెడ్రూం కమాన్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో భూంపల్లి నుంచి ఖాజీపూర్ వైపు వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై నారాయణ మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి..



శ్రీనివాస్(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి మండలం నర్సంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నర్సంపల్లి గ్రామానికి చెందిన ఉడుత శ్రీనివాస్(50) స్థానిక చెరువులో చేపల వేటకు వెల్లాడు. చెరువులో వేసిన వలకు చిక్కి నీట మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్యాంక్‌లో పడి కార్మికుడు..

పటాన్‌చెరు టౌన్: బ్రెయిన్ ట్యాంక్‌లో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తోటి కార్మికుల కథనం మేరకు... భద్రాచలంకు చెందిన రాజేశ్ కుమార్(31) బతుకుదెరువు కోసం వచ్చి జిన్నారం పరిధిలో ఉంటూ గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సెల్ మార్ ల్యాబ్ పరిశ్రమలో విద్యుత్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా బ్రెయిన్ ట్యాంక్ (ఉప్పునీటి ద్రావణం ఉత్పత్తి) లో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

WANTED

- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు కావలెను. సంప్ర॥ 9391912949, 04040123376 [H-800428]
- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185485]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [HA-1381]
- షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14726]
- ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో టీం లీడర్స్‌గా సిద్దిపేట, జగిత్యాల & సంగారెడ్డి మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q: 10th ఆపై Age: 25 ఆపై Contact: 9393055164. [HA-1177746]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.